పింఛన్ల కోసం ఎదురు చూపులు



ప్రభుత్వాలు ఇచ్చే కాస్తో.. కూస్తో పింఛను డబ్బులే వారికి జీవనాధారం.. అలాంటి పింఛన్లు కూడా రాకపోవడంతో వారి జీవనం దుర్భరమైంది. కన్నబిడ్డలు పట్టించుకోక.. అయిన వారి ఆదరణ లేక.. వయస్సు మీద పడి పనిచేసే సత్తువ లేక.. ఏదో సర్కారు ఇచ్చే పింఛన్ డబ్బులతో జీవనం సాగిద్దామనుకున్న వృద్ధులు, కళాకారులు, కార్మికులకు నిరాశే ఎదురైంది. కొత్త ప్రభుత్వంలో తమకు కాస్త ఆసరా ఉంటుంది అనుకుంటే అది కూడా లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 17 నెలలు దాటినా నేటికీ కొత్త పింఛన్లు రాకపోవడంతో వారంతా ఎదురు చూపులు చూస్తున్నారు. చేతిలో డబ్బుల్లేక.. మందులు కొనే స్థోమత లేక.. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తుండగా ప్రభుత్వ ప్రకటన కోసం పడిగాపులు కాస్తున్నారు. కొత్త పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- కొత్త ఫింఛన్లు మంజూరు అయ్యేనా?
- నాయకులు హామీలు నీటి మూటలు
- 17నెలలైనా తెరుచుకోని సైటు
- ఆందోళనల్లో వృద్ధులు, కళాకారులు, కార్మికులు

నంద్యాల టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్త పించన్లు ఎప్పుడు ఇస్తారోనని వృద్ధులు, కళాకారులు, కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 17నెలలైనా వారి ఆశలు అడియాశలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త పించన్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటికి చాలామంది ఎదురు చూపులు చూస్తూ ఉండిపోయారు. 60ఏళ్ల నిండిన అర్హత ఉన్న వద్ధులు, కల్లుగీత కార్మికులు, కళాకారులు తదితర వర్గాలకు చెందిన వేల మంది పించన్లు కోసం పడిగాపులు కాస్తున్నారు. 2024 ఎన్నికల్లో ప్రచారంలో పోటీల్లో ఉన్న ఆయా పార్టీల నాయకులు హామీలు ఇచ్చారు. అవి నేటికీ నెరవేరలేదు.



2023 నవంబరు నుంచి వెబ్‌సైట్‌ను..

2023 అక్టోబరు వరకు వచ్చిన పింఛన్లు దరఖాస్తు పరిశీలించి అర్హత ఉన్నవారికి అప్పటి వైసీపీ ప్రభుత్వం పించను మంజూరు చేసింది. 2023 నవంబరు నుంచి వెబ్‌సైట్‌ను పూర్తిగా మూసివేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సుమారుగా 17 నెలలు అవుతున్న సైట్‌ను తిరిగి ప్రారంభించే చర్యలు తీసుకోవడం లేదని అర్హులు వాపోతున్నారు. పలు సమావేశాల్లో సభల్లో పించన్లు ఎప్పుడిస్తారంటూ ప్రశ్నిస్తున్నా సరిషైన సమాధానం నాయకుల నుంచి రావడం లేదు.

డబ్బుల్లేక.. మందులు కొనలేక..

వృద్ధులు, నిరుపేద కళాకారులు, కల్లుగీత కార్మికులు అనారోగ్యానికి గురై కన్నబిడ్డల ఆదరణ నోచుకోని వారు డబ్బుల్లేక.. మందులు కొనలేక భారంగా బతుకు వెళ్లదీస్తున్నారు. పించను వస్తే ఆరోగ్యానికి మందులు కొనేవారమని, పోషణకు మందులకు కన్నబిడ్డల వద్ద చేయి చాచలేక రోజు గడిస్తే చాలనే భావనలో చాలా మంది ఉన్నారు.

ఎన్నికలకు ముందు..

2026సంవత్సరం ప్రారంభంలో పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రాదేశిక నియోజక వర్గాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ప్రకటన చేశారు. ఎన్నికల ప్రకటనకు ముందు అర్హులకు ప్రభుత్వం కనికరిస్తోందనే చిన్నఆశ ఇపుడిప్పుడే తలెత్తుతోంది. 2023 నవం బరు నుంచి 2025 సెప్టెంబరు వరకు సుమారుగా 20 నెలలుకు పైగా గడిచింది. కొత్త పించన్లు అర్హత ఉన్నవారి గోడు ఆలకించి సైట్ తెరవాలని ఆయా వర్గాల ప్రజలు కోరుతున్నారు.

ఉత్తర్వులు రాగానే దరఖాస్తు చేసుకోవచ్చు

చాలారోజుల నుంచి సైట్ ఓపెన్ చేయడం లేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అర్హులందరూ పించను మంజూరుకు దరఖాస్తు చేసుకోవచ్చు. స్థానికంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి తారతమ్యాలు లేకుండా పించన్లు మంజూరు చేస్తాం.

● శ్రీధర్‌రెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ, నంద్యాల

సమస్యలను సమష్టిగా పరిష్కరించుకోవాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

చాగలమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల సమస్యలను సమష్టి కృషితో పరిష్కరించుకోవాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో బర్ఫ్ ఉన్నత పాఠశాల ఆవరణలో అపుస్మా ఆధ్వర్యంలో జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అభివృద్ధి చెందడంతో పాటు పాఠశాలలను కూడా అభివృద్ధి పరచాలన్నారు. బర్ఫ్ ఉన్నత పాఠశాల భవనాలను, టెక్నాలజీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ప్రైవేటు పాఠశాలల ద్వారా ఎంతో మంది విద్యార్థులకు సమాజానికి ఉపయోగపడేలా విద్యను అందించాలని సూచించారు. ఎమ్మెల్సీని బర్ఫ్ కరస్పాండెంట్ పాల్‌రాజారావు, ఆళ్లగడ్డ నియోజకవర్గ అపుస్మా యూనిట్ సభ్యుడు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అపుస్మా జిల్లా అధ్యక్షుడు బిచ్చం సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, జిలా సమన్వయకర్తలు దస్తగిరి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ అపుస్మా అధ్యక్షుడు అమీర్‌బాషా, సంఘ నాయకులు మల్లికార్జున, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీధర్, కిరణ్, భూపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, మాబాష, జబ్బార్, రాజా తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నేర చరిత్ర కల్గిన వ్యక్తులు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర ప్రవృత్తిని అరికట్టే విధంగా పోలీసులు పనిచేయాలని సూచించారు. రౌడీషీటర్లు చట్టాన్ని గౌరవించి ఉండాలని, విరుద్ధంగా నడుచుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. వారి పిల్లల భవిష్యత్తు కోసం మార్పు అవసరమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

మహానందికి పోటెత్తిన భక్తులు

కోనేర్లల్లో పుణ్యస్నానాలు



ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ

మహానంది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహా నంది క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం లోని కోనేర్లల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిం చారు. ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరున్ని, కామేశ్వరీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. పరిసరాల్లోని నవనంది క్షేత్రాలు వినాయకనంది, గరుడ నందీశ్వరుని ఆలయాల్లో సైతం పూజలు చేశారు.

మినుము రైతు కుదేలు



కలుగొట్లపల్లెలో మినుము పంటను దున్నేస్తున్న రైతు

అధిక వర్షాలతో మినుము పంట దెబ్బతిని రైతులు కుదేలయ్యారు. మండలంలోని కలుగొట్లపల్లె గ్రామంలో మహిళా రైతు రాజేశ్వరి సాగు చేసిన మూడెకరాల మినుము పంట దెబ్బతింది. ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు ఆదివారం ట్రాక్టర్‌తో పంటను దున్నేశారు. మూడు నెలల పాటు పంటను కాపాడుకుంటూ వచ్చామని, పంట దిగుబడి సమయంలో అధిక వర్షాలు కురవడంతో పంట దెబ్బతిని భారీగా నష్టపోయామన్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని మహిళా రైతు కోరారు.

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఈనెల 24న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చని పేర్కొన్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబరు 1100 ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలివ్వాలని అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

ప్రాణ త్యాగాలకైనా సిద్ధం

- నంద్యాల టైగర్ జోన్ పరిధిలో 87 పెద్దపులులు
- సిబ్బంది విధుల్లో కఠినంగా వ్యవహరించాలి
- సీఎఫ్‌వో విజయ్‌కుమార్



సిబ్బందికి సూచనలిస్తున్న సీఎఫ్‌వో విజయ్‌కుమార్

బండిఆత్మకూరు నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణ కోసం ప్రాణ త్యాగాలకైనా సిద్ధమని కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ (సీఎఫ్‌వో), ఎన్ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం బండిఆత్మకూరు రేంజ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను అటవీ సంరక్షణకు తూచా తప్పకుండా పాటిస్తానన్నారు. దేశవ్యాప్తంగా 52 పులుల సంరక్షణ కేంద్రాలున్నాయని, నంద్యాల టైగర్‌జోన్ పరిధిలో 87 పెద్దపులులు ఉన్నాయని తెలిపారు. అటవీ సంరక్షణలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తేలేదని, ఆక్రమణలు, వన్యప్రాణి వేట, స్మగ్లర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అడవులు బాగా పెరిగితే పర్యావరణం ఎలాంటి కలుషితం లేకుండా మానవాళికి అంది ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. సిబ్బంది విధుల్లో కఠినంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో ఉపేక్షించనని సిబ్బందిని హెచ్చరించారు. ఎఫ్ఆర్వో నజీర్‌ఖా, ఎఫ్ఎస్‌వోలు నాగరాజు, కాశీమ్‌నాయక్, హైమావతి, ప్రసన్న, రాజేష్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

- స్తంభించిన ట్రాఫిక్
- దర్శనాలకు గంటల సమయం

శ్రీశైలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలానికి ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముఖద్వారం నుంచి క్షేత్ర ప్రవేశం చేసే వరకు సుమారు గంటన్నర సమయం పట్టేలా ట్రాఫిక్ నిలిచిపోయింది. సీఐ ప్రసాదరావు సిబ్బందితో కలిసి ప్రధాన కూడళ్లు, టోల్ గేట్, గణేష్ సదన్ ప్రాంతాల నుంచి వాహనాలను ఔటర్ వైపునకు మళ్లించారు. స్వామిఅమ్మవార్ల సర్వ దర్శనానికి నాలుగు గంటలు, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాలకు రెండు గంటలు, స్పర్శ దర్శనానికి గంట సమయం పడుతుందని అధికారులు తెలిపారు. క్యూ లైన్లలో ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతుల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సిబ్బందిచే పర్యవేక్షిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. టికెటులో ఉండే నిర్దీత టైంస్లాట్ ప్రకారం క్యూలైన్ల వద్దకు చేరుకుని ఆలయ సిబ్బందికి సహకరించాలని భక్తులను ఈవో కోరారు.



కంపార్టుమెంట్‌లో వేచి ఉన్న భక్తులు

ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు

- హాజరైన కలెక్టర్, జిల్లా అధికారులు

నంద్యాల కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్‌లోని సత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నంద్యాల సత్యసాయి కల్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలకు కలెక్టర్ రాజకుమారి, జేసీ కార్తీక్, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సత్యసాయి భక్త బృందంతో భక్తిపాటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి కల్యాణమండపానికి స్థలం ఇచ్చిన దాతలను, సత్యసాయి భక్తులను, సత్యసాయి కళ్యాణ మండపంలోని నిర్వాహకులను, పేదమహిళలకు కుట్టుమిషన్లు(3), పేదవిద్యార్థులకు నగదు బహుమతి(3), నారాయణసేవ భక్తులకు వస్త్రాలు, తదితర కార్యక్రమాలను ముఖ్యఅతిథి కలెక్టర్, జిల్లా అధికారుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. సత్యసాయిబాబా చిత్రపటానికి ఊంజల్ సేవా కార్యక్రమం నిర్వహిచారు. డీఆర్వో రామునాయక్, ఆర్‌డీవో విశ్వనాథ్, కమిషనర్ శేషన్న, సత్యసాయిబాబా భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి, జిల్లా అధికారులు

రోడ్డు ప్రమాదంలో స్నేహితుల దుర్మరణం

- తొమ్మిది మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి ఆందోళనకరం
- ఆగి ఉన్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్ద ఘటన

7

అన్యమత స్టిక్కర్లతో శ్రీశైలంలోకి కారు

- భద్రతా వైఫల్యమే కారణం
- హిందూ సంఘాల ఆగ్రహం

శ్రీశైలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్యమత స్టిక్కర్లతో శనివారం అర్ధరాత్రి శ్రీశైల క్షేత్రంలోకి కారు ప్రవేశించడం కలకలం రేపింది. శివసదనం ఐవోసీ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న కారును అటుగా వెళ్తున్న వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు గమనించి ఆలయ అధికారులకు సమాచారం ఇచ్చారు. సెక్యూరిటీ సిబ్బంది కారును తనిఖీ చేయగా కారుపై అన్యమతానికి చెందిన క్యాప్షన్లు, ఫొటో స్టిక్కర్లు, సైడ్ మిర్రర్లు, నెంబరు ప్లేటుపై మిషన్ తాలుకా పేరు, డ్యాష్‌బోర్డుపై గ్రంథం, డిక్కీలో కరపత్రాలు ఉన్నాయని ఆలయ భద్రత అధికారి దృష్టికి తీసుకెళ్లామని హిందూ సంఘాల నాయకులు చెప్పారు. అయితే కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న ఆలయ భద్రత అధికారి కారు డ్రైవరును నామమాత్రంగా విచారించి స్థానిక పోలీసులకు అప్పగించకుండా వదిలివేశారని వారు ఆరోపించారు. కారు నిండా క్యాప్షన్లు, ఫొటోలతో ఉన్న కారు టోల్‌గేటు దాటి క్షేత్రంలోకి ప్రవేశించడం భద్రతా సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విశ్వహిందూ పరిషత్ శ్రీశైలం మండల అధ్యక్షుడు నారాయణ అన్నారు. కొందరు అయ్యప్ప స్వాములు తెలిసిన వారి కారును తీసుకుని వచ్చారని, వారికి తెలియక క్షేత్ర దర్శనానికి వచ్చినట్లుగా సీఎస్‌వో పొంతన లేని సమాధానం చెబుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కారులో వచ్చిన స్వాములను కనీసం చూడకపోగా, మరో మతానికి చెందిన కారు డ్రైవరును పూర్తిస్థాయిలో విచారించకుండా విడిచిపెట్టారని, అలాగే కారును ఇక్కడి నుంచి పంపించేశారని వారు చెప్పారు. ఈ ఘటనపై సీఎస్‌వోను విచారించాలని ఈవోను కోరారు.



అన్యమత స్టిక్కర్లు కనిపించకుండా లేబుల్స్ వేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ప్రచారానికి రాలేదు : ఈవో శ్రీనివాసరావు

అన్యమత పోస్టర్లతో ఉన్న కారులో అయ్యప్పస్వాములు వచ్చినట్లు ఆలయ భద్రతా అధికారి తెలిపిన వివరాల ప్రకారం పూర్తిస్థాయిలో విచారించాలని పోలీసులకు చెప్పాం. క్షేత్ర పరిధిలో అన్యమత ప్రచారం వంటివి నిషేధం. అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

విచారించి కేసు నమోదు చేస్తాం : సీఐ ప్రసాదరావు

ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారిస్తాం. ప్రకారం ఆలయ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై దేవదాయ ధర్మదాయ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తాం.

రోడ్డు ప్రమాదంలో స్నేహితుల దుర్మరణం



పెరాయిపల్లె మెట్ట వద్ద ప్రైవేట్ బస్సును ఢీకొట్టిన లారీ



మృతి చెందిన హరిత, బద్రీనాథ్

- తొమ్మిది మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి ఆందోళనకరం
- ఆగి ఉన్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్ద ఘటన

ఆళ్లగడ్డ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న ప్రైవేటు బస్సును లారీ ఢీకొట్టడంతో ఇద్దరు స్నేహితులు మృతి చెందారు. తొమ్మిది మంది గాయపడగా.. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట వద్ద జాతీయ రహహదారిపై ఆదివారం తెల్లవారుఝామున జరిగింది. వివరాలివీ.. మైత్రి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని మియాపూర్ నుంచి 33 మంది ప్రయాణికులతో శనివారం పాండిచ్చేరికి బయలు దేరింది. ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్దకు రాగానే ఇద్దరు ప్రయాణికులు బహిర్భూమికి వెళ్లాలని డ్రైవర్‌ను కోరడంతో ఆయన బస్సును రోడ్డు పక్కన నిలిపారు. అయితే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో వెనుక సీట్లో కూర్చున్న పాండిచ్చేరికి చెందిన పి.హరిత(23), జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన గడ్డం బద్రీనాథ్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. హైదరాబాద్‌కు చెందిన చీపు శ్రీవాణి, వంశీ, బండ్ల శ్రావ్య, సాయివంశీ, అమలాపురానికి చెందిన ఎం.గణేశ్, రాయచోటికి చెందిన ఖాదర్‌వలి, ఆశాభేగం, కాజీపేట మండలం మిడుతూరు గ్రామానికి చెందిన అల్లూరి దొరస్వామి, చెన్నూరుకు చెందిన సుబ్బయ్య, అలాగే హైదరాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్ గాయపడ్డారు. క్షతగాత్రులను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఖాదర్‌వలి, ఆశాభేగం, బండ్ల శ్రావ్య సురేశ్‌ను నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, సీఐలు మురళీధర్‌రెడ్డి, యుగంధర్, ఎస్ఐ జయ్యప్ప ఘటనా స్థలానికి చేరుకొని లారీలో ఇరుక్కొని ఉన్న డ్రైవర్‌ను క్రేన్ సాయంతో బయటి తీసి 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ నలుగురిని మెరుగైన చికిత్స కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విహార యాత్రకు బయలుదేరి అనంత లోకాలకు..

గడ్డం బద్రీనాథ్, హరిత స్నేహితులు. వీరు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పాండిచ్చేరిలో ఉన్న స్నేహితులను కలిసి అక్కడే విహార యాత్రకు వెళ్లాలని హైదరాబాద్ నుంచి బయలుదేరారు. సీటు నెంబరు ఎఫ్-6 బద్రీనాథ్‌కు, ఎఫ్-2 హరితకు రిజర్వ్ అయింది. అయితే తనకు రిజర్వ్ అయిన ఎఫ్-2 సీట్‌లో కూర్చోవాలని హరిత ఎఫ్-4 సీటులో కూర్చున్న హైదరాబాద్‌కు చెందిన నరసింహారెడ్డిని విజ్ఞప్తి చేసింది. దీంతో ఇద్దరూ తమ సీట్లను ఎక్స్ఛేంజ్ చేసుకున్నారు. స్నేహితులిద్దరూ సమీపంలోని సీట్లలో కూర్చున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు.

కష్టపడి చదివించిన తల్లిదండ్రులు

జోగులాంబ గద్వాలకు చెందిన లక్ష్మీనారాయణ, రమాదేవి కుమారులు గడ్డం బద్రీనాథ్, గడ్డం సాయిని తల్లిదండ్రులు కష్టపడి చదించారు. బద్రీనాథ్ బీటెక్ పూర్తి చేసి హైదరబద్ లోని ఇన్ఫోసెస్ కంపెనీలో ఏడాది క్రితం ఉద్యోగం సంపాదించాడు. అలాగే చిన్న కుమారుడు సాయి ముంబైలో బెటెక్ చేస్తున్నాడు. తండ్రి లక్ష్మీనారాయణ వాచ్ రిపేరి సెంటర్ ద్వారా, తల్లి రమాదేవి టైలరింగ్ చేస్తూ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. చేతికి అందిన కుమారుడు తిరిగి రాని లోకాలు వెళ్లి పోవడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

ఘటనా స్థలాన్ని సునీల్ షెరాన్ పరిశీలించారు. ప్రమాద వివరా లను డీఎస్పీ ప్రమోద్, సీఐలు మురళీ . దర్‌రెడ్డి, యుగం . దర్‌ను అడిగి తెలుసుకున్నారు.



సంఘటనా స్థలంలో ఎస్పీ

మూడిళ్లల్లో దొంగతనం



దొంగలు పగలగొట్టిన బీరువా

నంద్యాల టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని తెలుగు పేట, అనకాలపేటలో మూడు ఇళ్లల్లో శనివారం రాత్రి దొంగతనాలు జరిగాయి. ఆదివారం పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగుపేటలో సుబ్రమణ్యం అనే వ్యక్తి రాత్రి భోజనం చేసి ఇంటిపైగదిలో నిద్రించడానికి వెళ్లారు. తెల్లవారుజామున కిందికి వచ్చి చూడగా తాళం పగిలిఉన్నది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఏడుతులాల బంగారు అభరణాలు, పావుకిలో వెండి, వెండి అభరణాలు, రూ.50 వేల నగదు చోరీకి గురయ్యాయి. అదే వీధిలో గురమ్మ అనే వృద్ధురాలు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టారు. అయితే ఇంట్లో ఏమీ దొరకకపోవడంతో వెనుదిగారు. అలాగే అనకాలపేటలో ఓ ఇంటి తాళం పగలగొట్టడానికి యత్నిస్తుండగా ఇంటి పక్కనే ఉన్నవారు లైట్ ఆన్ చేయడంతో వెనుదిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చోరీలు చేసేందుకు నంద్యాలకు కొత్త గ్యాంగ్ వచ్చిందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు గస్తీ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు

మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల సౌకర్యార్థం బెంగళూరు-నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు వేసినట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎస్ఆర్-బెంగుళూరు-హజ్రత్ సాహెబ్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్ నెంబరు:16593కు డిసెంబరు 1వ తేదీ నుంచి జనవరి 15 వరకు ఒక ఏసీ త్రీటైర్, ఒక స్లీపర్, ఒక జనరల్ కోచ్‌లను అదనంగా జత చేసి పంపుతున్నామన్నారు. దీనికి తిరుగు ప్రయాణం రైలు నెంబరు: 16594కు డిసెంబరు 3 నుంచి జనవరి 17 వరకు ఒక ఏసీ త్రీటైర్, ఒక స్లీపర్, ఒక జనరల్ కోచ్‌లను చేర్చి నడపుతున్నట్లు వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బేతంచెర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన నాయకంటి సుజాత (23) అనే మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ తెలిపారు. వివరాలు.. హనుమాన్‌నగర్‌కు చెందిన సుజాత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుం డేది. ఈనెల 21న రాత్రి వాజిమోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం భర్త హరీష్, బంధువులు మెరుగైన వైద్యంకోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతిచెందింది. భర్త, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

మహానంది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన సున్నం మహేష్(50) ఆదివారం తన ఇంటిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్య సమస్యలే కారణమన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మద్యం స్వాధీనం

వెలుగోడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఓవ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేశ్ ఆదివారం తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

కర్నూలు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుత్తి పెట్రోల్ బంకు వద్ద ఆర్టీసీ కండక్టర్‌పై శనివారం రాత్రి దాడి చేసిన విషయం విదితమే. ఈ ఘటనలో పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. కండక్టర్ మురళీకృష్ణ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ప్రయాణికురాలు కళ్యాణి ఫిర్యాదు మేరకు కండక్టర్‌పై కేసు నమోదు చేశారు. కండక్టర్, డ్రైవర్‌పై దాడి చేసి బస్సు అద్దాలు ధ్వంసం చేసినందుకు ప్రయాణికురాలి భర్త కిరణ్, కొడుకు, మరి కొంత మందిపై మరో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సర్వీసు రూల్స్ అమలు చేయాలి

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య



మాట్లాడుతున్న మిట్ట కృష్ణయ్య

చాగలమర్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సర్వీసు రూల్స్ తక్షణమే అమలు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టకృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చాగలమర్రి పీఆర్టీయూ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ ఛైర్మన్‌ను నియమించాలని, ఇంటిరియల్ రిలీఫ్ 30 శాతం ప్రకటించాలని, మహిళలకు ఛైల్డ్‌కేర్ లీవ్ 180 రోజులు పదవీ విరమణ లోపు వాడుకునేలా జీవో ఇవ్వాలని అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రతి పాఠశాలకు కంప్యూటర్ ఆపరేటర్‌ను కేటాయించాలని, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ తిరుపాల్, రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి, పీఆర్టీయూ నాయకులు మౌలాలి, ఆంజనేయరెడ్డి, దాదాపీర్, రవిప్రకాష్‌రెడ్డి, సుబ్బరాయుడు, దస్తగిరి పాల్గొన్నారు.

సత్యసాయిబాబా అందరికీ ఆదర్శం

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- ఘనంగా శతజయంతి



సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, విజయభారతి

ఓర్వకల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా అందరికీ స్ఫూర్తి, ఆదర్శమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లులోని బాలభారతి పాఠశాలలో మండల ఐక్యసంఘం గౌరవ సలహాదారురాలు విజయభారతి ఆధ్వర్యంలో శతజయంతి వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం వంద మంది మహిళలకు చీర, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవే పరమ ధర్మం అని బాబా చేసిన బోధనలే లక్షల మందికి మార్గం చూపాయన్నారు. అనంతపురం జిల్లా సత్యసాయిబాబా సేవా ట్రస్టు ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు, ఉచిత శస్త్ర చికిత్సలు కిడ్నీ ఆపరేషన్లు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేశారన్నారు. పేద విద్యార్థులకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యను అందజేశారన్నారు.

'అన్సర్ జ్యువెలర్స్' ప్రారంభం



అన్సర్ జ్యువెలర్స్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ అన్సర్ డైమండ్, గోల్డ్ జ్యువెలర్స్ షోరూమ్‌ను మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆదివారం ప్రారంభించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ సరసమైన ధరలకే నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలు అందించడం అన్సర్ జ్యువెలర్స్ ప్రత్యేకం అన్నారు. పట్టణంలోని అన్సర్ జ్యువెలర్స్‌లో నాణ్యమైన ఆభరణాలు లభిస్తున్నాయని అన్నారు. నంద్యాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్సర్‌జువెలర్స్ అధినేతలు అన్సర్, అమీర్, ప్రముఖ పారిశ్రామిక వేత్త రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంకురా అపెక్స్ హాస్పిటల్ ప్రారంభం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో అంకురా అపెక్స్ హాస్పిటల్ అండ్ ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆదివారం ఉదయం ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కేడీసీసీబీ ఛైర్మన్ డి.విష్ణువర్దన్ రెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గైనకాలజిస్టు అండ్ ఫెర్టిలిటీ స్పెషలిస్టు డా.ఎంసీ మల్లేశ్వరి, జనరల్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డా.జీవీ రమణ మాట్లాడుతూ వంద పడకలతో హైదరాబాదు తరహాలో ప్రారంభించామన్నారు. గైనకాలజీ, యూరాలజీ, ఫెర్టిలిటీ సెంటర్ అన్ని రకాల వాస్కులర్ సర్జరీ, మెడిసిన్, సర్జరీ, ల్యాపోస్కోపిక్ సర్జరీలు, ఆర్థో, మోకాళ్ల ఆపరేషన్, ఎన్ఐసీయూ, ఐసీయూ, నెఫ్రాలజీ, డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాస్కులర్ సర్జరీ డిపార్టుమెంట్ 20 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ అత్యాధునికంగా ఏర్పాటు చేశామన్నారు. వైద్యులు డా.ప్రసన్న కుమారి, డా.జాగృతి, డా.చిట్టిబాబు సభ్యులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ నాగరాజు, 'కుడా' ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

'రైతన్న మీకోసం'కు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి 29వ తేదీ వరకు కార్యక్రమాలు
- వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'రైతన్న మీకోసం' కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో మం త్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆయా మండలాల్లోని ప్రజాప్రతినిధులంతా పాల్గొని రైతుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి రైతులకు పంచసూత్రాల గురించి వివరించనున్నారు. నీటి భద్రత, డిమాండ్ ఉన్న ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు గురించి రైతులకు వివరిస్తారు. వ్యవసాయ శాఖ తయారు చేసిన పార్మర్ యాప్‌ను ప్రతి రైతుకు చేరువ చేయాలన్నారు. సోమవారం నుంచి 29వ తేదీ వరకు ప్రతి గ్రామంలో రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జేడీ తెలిపారు. డిసెంబరు 3న గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సమా వేశాన్ని నిర్వహిస్తామన్నారు. రైతుల ప్రయోజనాలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, సద్వినియోగించుకోవాలని ఆమె కోరారు.

నేటి రాజకీయాలకు దర్పణమే 'ఛైర్మన్' నాటకం



పత్తి ఓబులయ్యతో కళాకారులు

కర్నూలు కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేటి రాజకీయాలకు దర్పణంగా 'ఛైర్మన్' నాటకం నిలుస్తుందని హైదరాబాద్ రసరంజని కళా సంస్థ ఛైర్మన్ డి.రామకోటేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో 'ఛైర్మన్' నాటక ప్రదర్శన నిర్వహించారు. రాజకీయ నాయకుల్లో సేవాగుణం పోయి పదవి కాంక్ష పెరిగిపోయిందన్నారు. 1962లోనే దివంగత నాటక రచయిత కొడాలి గోపాలరావు రాశారని గుర్తుచేశారు. పత్తి ఓబులయ్య దర్శకుడు డి.రామకోటేశ్వరరావుకు టీజీవీ కళాక్షేత్రం తరపున రూ.35వేల పారితోషికం అందజేసి, కళాకారులను సన్మానించారు. కళాకారులు కృష్ణమూర్తి, డొక్కా బాచి, అవినాష్, మోహన్, శ్రీజ సాదినేని, ఘనపురం శశి, కేకే రెడ్డి, అఖిల్, పుండరీక్ తమ నటనతో మెప్పించారు. కన్వీనర్లు కేవీ రమణ, కదిరి రమేష్, కళాక్షేత్రం కార్య దర్శి సి. యాగంటీశ్వరప్ప, ఉపాధ్యక్షుడు సీవీ రెడ్డి, కళాకారులు పి. రాజారత్నం, చల్లా నవీన్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌ని కలిసిన కేశన్నగౌడు

డోన్ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేఈ ప్రభా కర్‌ను డోన్ మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు ఆదివారం కర్నూలులో కేఈ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేశన్నగౌడు మాట్లాడుతూ కేఈ కుటుంబం బీసీలకు అండగా నిలిచిందన్నారు. కేఈ ప్రభాకర్ జన్మదిన వేడుకల్లో కేశన్నగౌడు పాల్గొని కేక్ కట్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి జన్మదిన వేడుకలు గొప్పగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని పని చేసిన వారికి న్యాయం జరుగుతుందన్నారు. అందరం కలిసికట్టుగా టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. కేఈ ప్రభాకర్‌ను కలిసిన వారిలో కిరణ్ యా దవ్, ఓబులాపురం మనోహర్, రాము గౌడు, రంగస్వామి గౌడు, సుదర్శన్ గౌడు, ధర్మవరం మద్దిలేటి, ఇమామ్ ఉన్నారు.




కేఈ ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీఈ కేశన్నగౌడు

'ఏపీ టూరిజం' పేరుతో నకిలీ వెబ్‌సైట్

- మోసపోయిన మల్లన్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులు బస చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుని మోసానికి గురవుతున్నారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన రాజీవ్ తను కుటుంబ సభ్యులు ఆరుగురు శ్రీశైలం ఏపీ టూరిజం హరిత హోటల్‌కు చేరుకున్నారు. ఆన్‌లైన్‌లో రూ.6 వేల రూపాయలు చెల్లించి చేసుకున్న బుకింగ్ రసీదు చూసిన హరిత అధికారులు సిబ్బంది దానిని నకిలీదిగా గుర్తించారు. అలాగే బెంగళూరుకు చెందిన ఆర్మీ అధికారి కృష్ణమూర్తి కూతురు జన్మదినం సందర్భంగా భార్య పిల్లలు, తల్లితో కలిసి క్షేత్రానికి వచ్చారు. వీరు కూడా అదే విధమైన వెబ్‌సైట్ ద్వారా మోసపోయినట్లు తెలియడంతో ఖంగుతిన్నారు. బాధితులు మాట్లాడుతూ గూగుల్‌లో ఏపీ హరిత హోటల్ అని సెర్చ్ చేసి మొదటి వెబ్‌సైట్‌లో లావాదేవీలు జరిపినట్లు చెప్పారు. ఆర్మీ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ క్షేత్ర పరిధిలో మొబైల్ సిగ్నల్స్ లేవని కేవలం వాట్సప్ వాయిస్ కాల్ మాత్రమే మాట్లాడి బురిడీ కొట్టించాడని తెలిపారు. అదే విధంగా గర్భాలయ స్పర్శ దర్శనం గురించి అడగ్గా.. ఆలయంలోని అర్చకులు తనకు బాగా పరిచయమేనని నకిలీ మేనేజర్ మనీష్ చెప్పినట్లు పేర్కొన్నారు. వసతి గదులు బుకింగ్ ఓకే చేయాలంటే ఆన్‌లైన్ ద్వారా నగదు పంపామని చెప్పారు. మొదటి సారి నెఫ్ట్ ద్వారా పంపామని, అయితే దీని ద్వారా బుకింగ్ వెంటనే కన్ఫర్మ్ చేయాలేమని చెప్పారన్నారు. మరోసారి ఐఎంపీస్ ద్వారా పంపితే మొదట చేసిన డబ్బులను తిరిగి పంపతామని చెప్పి రెండు సార్లుగా మొత్తం రూ.30 వేల రూపాయలు పంపించామని బాధితులు చెప్పారు. నగదు బదిలీ సమయంలో కాస్తంత అనుమానం కలిగిన ఆర్మీ అధికారిని మనీష్ మాటలతో సతమతం చేస్తూ గత 10 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నట్లు నమ్మించాడని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికారిక టూరిజం సంస్థకు నకిలీగా జరుగుతున్న ఆన్‌లైన్ మోసానికి అడ్డుకట్ట వేసి భక్తుల సొమ్ము దొంగలపాలు కాకుండా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. క్షేత్రంలో రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ప్రత్యామ్నాయ వసతి ఏర్పరుచుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చిందని అన్నారు.



గూగుల్‌లో కనిపిస్తున్న ఫేక్ వెబ్‌సైట్



ఆర్మీ అధికారికి పంపిన రసీదు

30న కాంగ్రెస్ కేంద్ర కమిటీ పర్యటన

డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్ తదితరులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30 నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కేంద్ర కమిటీ పర్యటిం చనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆయన విలేకర్లతో మాట్లాడారు. నూతన నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడు ముందు ఉంటా నన్నారు. పార్టీలో పనిచేస్తున్న ఆశావాహులు, కార్యకర్తలు డీసీసీ, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. ఆ నివేదికను అధిష్టానానికి సమర్పిస్తానన్నారు. అధిష్టానం అర్హులను ఎంపిక చేస్తుందన్నారు. డోన్ నియోజకవర్గం సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి, నంద్యాల డీసీసీ ఉపాధ్య క్షులు జనార్దన్, బాలస్వామి, అసంఘటిత కార్మిక సంఘం కర్నూలు, అనంతపురం ఇన్‌చార్జి పఠాన్ హబీబ్‌ఖాన్, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి రజాక్‌వలి, జిల్లా కార్యదర్శి హుస్సేన్‌బేగ్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో జేసీ


మహానందిలో వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న జేసీ కార్తీక్

మహానంది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆదివారం నంద్యాల జాయింట్ కలెక్టర్ కార్తీక్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద ఏఈవో మధు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు అభిషేకార్చన, పూజలు నిర్వహించారు. కల్యాణమంటపంలో జేసీ దంపతులను వేదపండితులు సత్కరించి ఆశీర్వదించారు. వీరివెంట తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా

● ఎస్పీ సునీల్ షెరాన్ ● ఆయా గ్రామాల్లో కార్డన్‌సెర్చ్


సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలకు భరోసా కల్పించేందుకు వారంలో ఒక రోజు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున జిల్లాలోని నంద్యాల, పాణ్యం, ఆత్మకూరు, వెలుగోడు, జూపాడుబంగ్లా, రేవనూరు, ప్యాపిలి స్టేషన్ల పరిధిలో స్థానిక పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో సరియైన పత్రాలు లేని 10 వాహనాలను , అక్రమంగా విక్రయిస్తున్న 145మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేర చరిత్ర కలిగిన అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించామన్నారు. అక్రమ మద్యం అమ్ముతున్నవారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి


సన్మాన గ్రహీతలతో పూర్వ విద్యార్థులు

వెలుగోడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూతన ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా పరిషత్ రిటైర్డ్ సీఈవో జయపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. వెలుగోడు సర్పంచ్ జయపాల్ మాట్లాడుతూ మండలంలో 28మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం గర్వ కారణమన్నారు. కార్యక్రమంలో విద్యాధికారి-2 నాగబ్రహ్మం, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సిల్వర్ జూబ్లీ వేడుకలు


జ్ఞాపికలతో ఉపాధ్యాయులు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 2000డీఎస్సీలో ఉద్యోగం పొందిన మున్సిపల్ ఉపాధ్యాయులు 25ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం పట్టణంలోని తేజస్విని హోటల్‌లో సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించుకున్నారు. దాదాపు 60మంది ఉపాధ్యాయులు కలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాదరెడ్డి, జిల్లా మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.శివకుమార్, ఆనంద్, దేవేంద్ర, నాగశేషులు, సీత, భారతి, పద్మావతి, జానకిదేవి పాల్గొన్నారు.

'ఎన్‌కౌంటర్లపై విచారణ జరపాలి'

నంద్యాల రూరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మవోయిస్టు పార్టీ నేతలపై జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ జరపాలని వామపక్ష పార్టీ నాయకులు రమేశ్‌కుమార్, నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అడవుల్లోని ఖనిజ సంపదను బడా నేతలకు అప్పగించేందుకు అడ్డుగా ఉన్నరని ఆదివాసులను, మవోయిస్టులను మట్టుబెడుతున్నారని ఆరోపించారు. మారేడు పల్లి అడవుల్లో కాల్చి చంపడం దుర్మార్గమన్నారు. ఎన్‌కౌంటర్‌లో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బాబా ఫకృద్దీన్, లక్ష్మణ్, గౌస్, శంకర్, సోమన్న పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 2లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు క్వింటా రూ.1600 నుంచి రూ.1800 మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తద్వారా రైతులు ఎకరాకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటా రూ.2400 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఈ నెల 24 నుంచి 29వ తేది వరకు జరగనున్న అధికారుల గ్రామ పర్యటనల్లో భూసమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వరరావు, వీరన్న, మహెబూబ్‌బాషా, రాముడు, హరినాథ్ తదితరులు ఉన్నారు.

సత్యసాయిబాబా సేవలు మరవలేనివి

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
● ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు


సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న ఆర్డీవో, అధికారులు, సభ్యులు

నందికొట్కూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా సేవలు మరవలేనివి అని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాబా చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయిబాబా వెనకబడిన రాయలసీమ, తెలంగాణ ప్రాంతవాసులకు మంచి నీటిని అందించి ఒక మిషన్ స్థాపించి ఎనలేని సహాయం చేశారని గుర్తుచేశారు. ఆయన శతజయంతి ఉత్సవాలు జరుపుకోవడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆధ్యాత్మికతే.. మానవాళి శాంతికి మార్గదర్శకమని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయిబాబా ధ్యానమందిరంలో బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. సత్యసాయిబాబా ప్రబోధించిన బోధనలను భక్తబృందం సభ్యులు భక్తులకు వివరించారు. సాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో నాగేంద్రుడు, కమిషనర్ రమేష్‌బాబు, డీటీ ఆంజనేయులు, సేవాసమితి సభ్యులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

పాములపాడు: మండకేంద్రంలో సత్యసాయిబాబ శతజయంతి వేడుకలను బీజేపీ మండల నాయకుడు రాయపాటి మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం స్థానిక శివాలయ ఆవరణలో బాబా చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాలయ్య, శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: పట్టణంలోని సంజీవనగర్‌లో వెలసిన సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఓకారం, సుప్రభాతంతో కార్యక్రమాలు మెదలు పెట్టారు. నగరసంకీర్తన, కేక్‌కటింగ్, వేదపఠనం, గ్రామోత్సవం, కుట్టుమిషన్లు పంపిణీ, ప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

భారత్‌వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని ఆయుష్ యోగా కేంద్రంలో ఆదివారం భారత్‌వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృత్రిమ అవయవాల కోసం 120 మంది దివ్యాంగుల నుంచి కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో భారత్‌వికాస్ పరిషత్ అధ్యక్షుడు ఆనంద్ గురూజీ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ లాయర్ తులసిరెడ్డి, రోటరీ మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామమూర్తి, కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌లాల్ పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని బుక్కాపురం కోదండరామాలయం ఆవరణలో బాబా జయంతి వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవి హాజరై సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాల వేశారు. ఆలయం పరిసరాల్లో శ్రీగంధం, చందనం మొక్కలను నాటారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండలంలో సత్యసాయిబాబా చిత్రపటానికి మండల స్పెషల్ ఆఫీసర్ లీలావతి పూలమాల వేశారు. ఏవో శ్యామల, సూపర్‌వైజర్ రమాదేవి, ఈసీ రమేష్‌నాయుడు, టీఏ అభిషేకంరాజు, డీటీ శ్రీనువాసులు, సిబ్బంది సుకుమార్, ఫణీంద్ర పాల్గొన్నారు.

పాణ్యం: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నంద్యాలలో కేక్ కటింగ్.., గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న భక్తులు


బండిఆత్మకూరులో..


పాణ్యంలో..

ఘనంగా చండీ హోమం


కొలనుభారతిలో చండీ హోమం నిర్వహిస్తున్న స్వామిజీ

కొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్ఞానసరస్వతి అమ్మవారి సన్నిధిలో ఆదివారం అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమం పీఠాధిపతి శివానందలహరి స్వామిజీ శిష్యుడు నాగేంద్ర స్వామి ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. విశ్వంలో సకల జీవ జనులు, పశుపక్షాదులు, సుఖసంతోషాలతో ఉండాలని చండీ హోమాన్ని నిర్వహించామని నాగేంద్రస్వామీజీ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు కల్పించాలి

కొలనుభారతిలో భక్తులకు మెరుగైన సేవలు కల్పించాలని బీజేపీ సీనియర్ మహిళా నేత బోడపాటి మాధురి ప్రభుత్వాన్ని కోరారు. హోమం, పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. కొలనుభారతి క్షేత్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని శ్రీశైలంలో విలీనం చేయడం స్థానిక ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కృషి, పట్టుదల అభినందనీయమన్నారు. ముఖ్యంగా భక్తులకు వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో గుంటూరులో వచ్చేనెల 10 నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు స్ఫూర్తితో వికసిత్ భారత్ కార్యక్రమ లక్ష్యంతో భాగంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమాఖ్య జాబ్‌మేళాను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగించుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంఘం అడ్వజరీ కమిటీ సభ్యులు రంగనాథశర్మ, ప్రధాన కార్యదర్శి మనోహరరావు, కరివేన మాజీ ఎంపీటీసీ కైప శివశంకరశర్మ, ఆత్మకూరు కన్వీనర్ గరుడాద్రి సుదర్శన్, ఉపాధ్యక్షులు ఇస్కాల సురేష్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కల్లే చంద్రశేఖర్ శర్మ, మెంబర్‌షిప్ కన్వీనర్ రాజశేఖరరావు, సంబరాజు దుర్గాప్రసాద్, సుందరరామశర్మ, గరుడాద్రి సత్యనారాయణశర్మ తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు


అమలాపురం గ్రామ సభలో మాట్లాడుతున్న సీఐ రాము

ఆత్మకూరురూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ రాము హెచ్చరించారు. ఆదివారం అమలాపురం గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఆ గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనుమానితుల వేలి ముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైజ్ ద్వారా పరిశీలించారు. పలువురి ఇళ్ల నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సభ నిర్వహించి సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్యవివాహాలు,మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, శక్తి యాప్ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు చేపడితే ప్రజలు డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సీఐ రాము ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జూపాడుబంగ్లా: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జూపాడుబంగ్లా ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. మండలంలోని పారుమంచాల గ్రామంలో ఆదివారం ఉదయం కార్డన్‌సర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి వద్ద 35 మద్యం బాటిళ్లు, 11 బీరుసీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ప్రధానకూడలిలో సమావేశం నిర్వహించి ఎస్ఐ పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వెండి సామగ్రి, నగదు విరాళం

పాణ్యం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి భక్తులు వెండి సామగ్రి, నగదు విరాళంగా అందజేశారు. ఆదివారం నంద్యాలకు చెందిన కోమ హేమేశ్వర్ కుటుంబ సభ్యులు 200 గ్రాముల వెండి పళ్లెం విరాళంగా అందజేశారు. పాణ్యం మండలం భూమనపాడు గ్రామానికి చెందిన ఆవుల సుదర్శన్ రూ.25వేలు నగదు, హైదరాబాదుకు చెందిన జైనికల భారతి రూ.15వేల నగదు విరాళాన్ని ఈవో రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామివారి అభిషేకాలు, అర్చనలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

చిన్నారి అప్పగింత

శ్రీశైలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తప్పిపోయిన చిన్నారిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ ప్రసాదరావు వివరాల ప్రకారం.. తెలంగాణ ఆమన్‌గల్ గ్రామానికి చెందిన రమేష్, శిరీష దంపతుల కుమార్తె చిట్టితో కలిసి శ్రీశైలానికి వచ్చారు. అయితే చిన్నారి తప్పిపోయింది. ఆలయ పరిసరాల్లో ఏడుస్తూ తిరుగుతుండగా బ్లూకోట్స్ సిబ్బంది గమనించి చేరదీశారు. సాయంత్రం చిన్నారిని తండ్రికి అప్పగించారు.

ఆదిదంపతులకు ప్రత్యేక పూజలు

శ్రీశైలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల ఆదిదంపతులకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశా రు. సాయంత్రం అమ్మవారి ప్రాకార మండపంలో పల్లకీపై స్వామిఅమ్మవార్లను ఆశీనుల చేసి ఊరేగించారు. అదేవిధంగా మాడవీధిలో కళారాధన వేదికపై కడపకు చెందిన తిరుపతి బృం దం పలు భక్తి గీతాలకు తిరుపతి, విజయ్‌బాబు, శివ, శివకుమార్ తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

క్షేత్ర పాలకుడికి వెండి కిరీటం విరాళం

శ్రీశైల క్షేత్ర పాలకుడు బయలు వీరభద్రస్వామికి వెండి కిరీటం, కర్ణాలు, నేత్రాలను విరాళంగా అందజేశారు. ఆదివారం శ్రీశైలానికి చెందిన సుబ్రహ్మణ్యం సుమారు 1.230 కేజీల బరువు గల వెండి ఆభరణాలను ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షకులు రవి, మల్లికార్జున, సావిత్రిలకు అప్పగించారు. దాతకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించి వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదం, శేషవస్త్రమును అందించారు.


వెండి ఆభరణాలను అధికారులకు ఇస్తున్న భక్తులు

భీమేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం


దేవస్థానం ధర్మకర్తలుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

నంద్యాల కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూలమఠంలోని భీమలింగేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం ఆదివారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. చైర్మన్‌గా నారాయణ, ధర్మకర్తలుగా నాగఫణి శర్మ, పెద్ద తిరుమలమ్మ, సుబ్బరాయుడు, వెంకటసుబ్బమ్మ, సుజాత, బాలుడు, వెంకటలక్ష్మీ, గోపాల్, వెంకటరామశాస్త్రి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, అడ్వకేట్ రామచంద్రారావు, నాయకులు వర్దంశెట్టి రాజారాం, పాణ్యం రామయ్య, మిద్దె హుసేని, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, చలంబాబు, జిల్లెల్ల శ్రీరాములు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

● వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మీల్ అమీర్‌బాషా


కోటీ సంతకాల సేకరణలో పాల్గొన్న వైసీపీ నాయకులు

నంద్యాల రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మీల్ అమీర్‌బాషా డిమాండ్ చేశారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో పీపీపీని వ్యతిరేకిస్తూ నంద్యాలలో కోటీ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని కొనసాగించకుండా ప్రైవేటీకరించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, మనోజ్ కుమార్, రసూల్ ఆజాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైతన్న మీకోసం'

నంద్యాల రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి డిసెం బరు 3వరకు రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మా ట్లాడుతూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రతి రోజు 90 మంది రైతులను కలి సి సాగు చేస్తున్న పంటల వివరాలు తెలుసుకుంటామన్నారు. వ్యవసా య పద్ధతులను వివరిస్తామన్నారు. మండలంలో సేకరించిన సమాచా రాన్ని డిసెంబరు 3న గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. అనంతరం నివే దికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

జయప్రదం చేయాలి

ఆత్మకూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 24 నుంచి 29వరకు జరగ నున్న రైతన్న - మీకోసం కార్యక్రమాలను జయప్రదం చేయాలని వ్యవసాయాధికారి హేమలత తె లిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. సాగును లాభసాటిగా మార్చడమే లక్ష్యమన్నారు. డిసెంబరు 3న గ్రామాల్లోని రైతు సే వా కేంద్రాల్లో వ్యవసాయ ప్రణాళికను కూ డా తయారు చేస్తారని వెల్లడించారు.

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎంపిక


నూతనంగా ఎంపికైన జిల్లా కార్యవర్గ సభ్యులు

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నేషనల్ పీజీ కళాశాలలో జిల్లా కార్యవర్గ ఎన్నికలను రాష్ట్ర పరిశీలకులు అశోక్‌కుమార్, రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా భాస్కర్‌రెడ్డి, సుందర్‌రావు, జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కేవీ శివయ్య, ఉపాధ్యక్షులుగా తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, ఖాజాహుశ్శేన్, రాములమ్మ, పుల్లయ్య, సుబ్బారెడ్డి, రమేష్‌బాబు, కార్యదర్శులుగా మధు, చంద్రహాస్‌రెడ్డి, దస్తగిరి, నూరుల్లా, శైలజ, హమీద్‌బాషా ఎంపికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా వీరేశ్వరరెడ్డి, జాకీర్‌హుశ్శేన్, ఆడిట్ కమిటీ సభ్యులుగా మురళీధర్‌రెడ్డి, నరేష్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. రాష్ట్ర పరిశీలకులు నూతన సభ్యులతో ప్రమాణం చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

లస్కర్ మృతి


ఇస్మాయిల్

నందికొట్కూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన అవుట్ సోర్సింగ్ లస్కర్ ఇస్మాయిల్ (58) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కోడుమూరు డివిజన్ ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో అవుట్ సోర్సింగ్ లస్కర్‌గా పని చేస్తున్నారు. కొంత కాలంగా అనారోగ్య కారణంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఉదయం ఆయన స్వగృహంలో భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే ఔట్‌సోర్సింగ్ లస్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, జిల్లా మాజీ కార్యదర్శి గుంపుల వెంకటేశ్వర్లు, బండి జయరాజు నివాళి అర్పించారు.

ప్రథమ నందీశ్వరాలయ ఈవోగా చంద్రుడు

నంద్యాల కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రథమ నందీశ్వరాలయానికి ఇన్‌చార్జి ఈవోగా చంద్రుడును దేవాదాయ శాఖ అధికారులు నియమించారు. భోగేశ్వరం, ప్రథమనంది, సూర్యనంది గ్రూపు దేవస్థానాలకు ఈవోగా పనిచేస్తున్న రామానుజన్ గత నెలలో పదవీవిరమణ చేశారు. ఆయన స్థానంలో కోవెలకుంట్లకు చెందిన గ్రూప్ దేవాలయాల ఈవో చంద్రుడును నియమించారు. స్థానిక ఎమ్మెల్యే గౌరు చరిత అభ్యర్థన మేరకు బోగేశ్వరం ఈవోగా చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు.

శిబిరాన్ని వినియోగించుకోండి

ఆత్మకూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 3 నుంచి 18ఏళ్లలోపు దివ్యాంగులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలనందు సోమవారం జిల్లా సమగ్ర శిక్షా, ఏఎల్ఐఎంసీఓ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత సహాయ ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు మార్గరేట్, అయూబ్ అహ్మద్ తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకోని శిబిరానికి హాజరుకావాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదురుపాడు గ్రామానికి చెందిన బివెంకటేశ్వర్లు (35) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి త్యాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మావోయిస్టుల హత్యలను ఆపాలి

బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా సీపీఐ ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

డోన్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల హత్యలను ఆపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ డోన్ పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు నేతలను శాంతియుత చర్చలకు పిలిపించి మావోయిస్టు నేత సుగ్నాను, ఆయన భార్యతోపాటు 8 మందిని హత్య చేయించిన కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌పై సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మండల కార్యదర్శి నారాయణ, అనుబంధ సంఘాల నాయకులు రామ్మోహన్, పృథ్వి కుమార్, అబ్బాస్, మనోహర్ పాల్గొన్నారు.

వైద్యసేవలు శూన్యం: సీపీఎం

డోన్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు శూన్యమని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ ఆరోపించారు. ఆదివారం సీపీఎం తనిఖీ బృందం డోన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ గదులు తాళాలు వేసి ఉండటంతో సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డోన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో నక్కి హరి, అశోక్, షమీమ్ బేగం, సూర్య, పద్మావతి, మాధవి పాల్గొన్నారు.

గంగమ్మకు గ్రామోత్సవం

చాగలమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెరువుకట్ట వద్ద వెలసిన గంగా భవాని అమ్మవారికి మహిళలు చీర, సారెతో ఆదివారం గ్రామోత్సవం చేశారు. మహిళలు చీర, సారెతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా అబ్దుల్ రెహమాన్

రుద్రవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేక అధికారిగా అబ్దుల్ రెహమాన్‌ను కలెక్టరు రాజకుమారి గనియా నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఐసీడీఎస్ పీడీని బండిఆత్మకూరు మండలానికి కేటాయించినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

నిఘా వ్యవస్థతో సత్ఫలితాలు

● కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నేరాల గుర్తింపు

డోన్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థతో (సీసీ కెమెరాలు) సత్ఫలితాలిస్తున్నాయి. పట్టణ ప్రధాన కూడలి ప్రాంతాలు, ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి డీఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలీసు అధికారులు నేరాల నియంత్రణపై నిఘాను కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాల వ్యవస్థను కూడా ఉపయోగించుకుంటున్నారు. శుక్రవారం డోన్ పట్టణం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన మోహన్ అనే వ్యక్తి తన సెల్‌ఫోన్ చోరీకి గురైందని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. స్పందించిన పోలీసు అధికారులు కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల ద్వారా వచ్చిన స్ర్కీన్‌లో అను మానాస్పద వ్యక్తులను గుర్తించి వారిని పట్టుకుని విచారించి సెల్‌ఫోన్ రికవరీ చేశారు.





డోన్ పాతబస్టాండు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా, డీఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్

పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, పోలీసులు నిందితున్ని డీఎస్పీ ఎదుట హాజరు పరిచి, చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి డీఎస్పీ చేతుల మీదుగా సెల్‌ఫోన్‌ను అందజేశారు.

కేసులు త్వరగా ఛేదిస్తాం



సీసీ కెమెరాల ఆదారంగా చాలా కేసులు త్వరగా ఛేదించడానికి వీలు పడుతుంది. నేరాలకు సంబంధించిన సమాచారాన్ని బాధితులు పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలి.

● శ్రీనివాసులు, డీఎస్పీ, డోన్

నిఘా వ్యవస్థపై హర్షం



డోన్‌లో పోలీసు నిఘా వ్యవస్థను అధికారులు పటిష్టం చేయడం హర్షణీయం. గత వైసీపీ ప్రభుత్వంలో డోన్‌లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటులో అప్పటి పోలీసులు శ్రద్ధ తీసుకోలేదు. ప్రస్తుత డీఎస్పీ శ్రీనివాసులు సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణ చర్యలకు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం.

● వై.హనుమంతరెడ్డి, డోన్

ఘనంగా సత్యసాయిబాబా శతజయంతి

చాగలమర్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను ఎంపీడీవో తాహిర్‌హుసేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. సీనియర్ సహాయకులు బాలనరసింహులు, కార్యదర్శి ఆదినారాయణ, ఎంసీవో రాజ్‌కుమార్, షేక్షావలి పాల్గొన్నారు.



చాగలమర్రిలో సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీవో, కార్యదర్శులు

ఆళ్లగడ్డ: స్థానిక విశ్వరూప నగర్‌లో వేద ఫిజియో థెరపీ వైద్యులు నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జాహన్, ప్రత్యేక అధికారి హరిగోపాల్‌లకు వైద్యులు జ్ఞాపికలను అందజేశారు. వార్డ్ ఇన్‌చార్జి రామాచారి పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో అధికారులకు జ్ఞాపికలను అందజేస్తున్న వైద్యులు

రుద్రవరం: ప్రజలకు సత్యసాయిబాబా ఎనలేని సేవలందించారని మండల ప్రత్యేకాధికారి అబ్దుల్‌రహిమాన్ అన్నారు. ఆదివారం రుద్రవరం మండల పరిషత్ కార్యాలయంలో సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. డిప్యూటీ ఎండీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దారు ధోనీ ఆల్ ఫ్రెడ్, వీఆర్వో అంకాలయ్య, సీనియర్ అసిస్టెంటు షఫక్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో ప్రసాద్ రెడ్డి, 108 అధికారి పవన్ గోపాల్‌లు సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ పుట్టిన ఊరు కొలిమిగుండ్ల కావడం ఎంతో అదృష్టమని పలువురు వక్తలు కొనియాడారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

కొలిమిగుండ్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి, పులిప్రకాష్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ శివశంకర్, పెద్దిరెడ్డి, గురుస్వామి, చంద్రమౌళిగౌడ్, సుబ్బరా యుడులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి, సత్యాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న టీడీపీ కో-కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి

ఆలయాభివృద్ధికి రూ.50,116 విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

బనగానపల్లె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీ అమ్మవారి ఆలయాభివృద్ధికి దాతలు రూ.50,116 విరాళాన్ని ఆదివారం కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డికి అందజేశారు. నంద్యాల జిల్లా సర్వాయిపల్లె గ్రామానికి చెందిన ముడియం రమేష్‌రెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి, శాలు వాతో సత్కరించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు గుత్తి నరసింహులు, ఆవుల ప్రతాప్ అన్నారు. స్థానిక బ్రహ్మంగారి మఠం ఆలయ ఆవరణలో పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరోసా కల్పిస్తున్నాయన్నారు. 6,807 మంది రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కింద రూ.4.71 కోట్లు రైతులకు పంపిణీ చే సిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ



బొడ్రాయి ప్రతిష్ఠలో పాల్గొన్న ప్రజలు

రుద్రవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలూరు గ్రామంలో ఆదివారం బొడ్రాయిని ప్రతిష్ఠించారు. ఎస్ఐ మహ్మద్‌రఫీ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఏనుగమర్రి విద్యార్థులు

ప్యాపిలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని వెంకటేశ్వర విద్యామందిరంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో మండలంలోని ఏనుగమర్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. చెకుముకి పరీక్ష పోటీల్లో దాదాపు 40 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా అందులో ఏనుగమర్రి పాఠశాల విద్యార్థులు రాగ నిత్య, హర్షవర్ధన్, గీతాలక్ష్మి ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు నాగరాజు, మాణిక్యంశెట్టి, రామమూర్తి, లతీఫ్, సాలయ్య, మద్దిలేటి పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు



వేడుకల్లో పాల్గొన్న సీఐ ఇంతియాజ్ బాషా

డోన్ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కొండపేటలో వెలసిన హజరత్ హసన్ ఆలీ మౌలాలి స్వాముల వారి ఉరుసు ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. దర్గా పీఠాధిపతి ఖాజా మాసుంవలి హుశేనీ చిస్తీ కలిఫా ఆధ్వర్యంలో స్వామివారికి ఫతేహాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదివారం జియారత్ కిస్తీ, ప్రసాదాల వితరణ దర్గా అధ్యక్షులు షేక్ అబ్దుల్ రెహిమాన్ ఇంటి నుంచి తులసి, ముంతాజ్ ఇళ్ల నుంచి దర్గా షరీఫ్‌కి చేరి ఫాతేహాలు సమర్పించారు. ఈ వేడుకల్లో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో సయ్యద్ ఖాజా పాషా మొబాలీగ్. ఇ.ఇస్లాం ఖాద్రి, సూఫి సయ్యద్ జాకీర్ హుశేన్ సాహెబ్ ముబాలిగ్‌లు హాజరై పలు ఉపన్యాసాలు బోధించారు. కార్యక్రమంలో వలి, బాబా, ఆలీ, కొనిదేడు హసన్, హబీబ్‌బాషా, షాషు, జలదుర్గం శ్రీను, నాగరాజు, మధు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

ప్యాపిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమేకల పల్లి గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు బట్టా చంద్రశేఖర్ (60)అనారోగ్యంతో మృతి చెందాడు. యువనాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు బట్టా సత్యంచౌదరిని కలిసి ఓదార్చారు. ఆయన వెంట నాయకులు ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.



పరామర్శిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవనూరు పీహెచ్‌సీ వైద్యుడు సుభాన్ అన్నారు. ఆదివారం రేవనూరు పీహెచ్‌సీలో రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి జ్వరం వస్తే స్థానిక వైద్యుల సలహా తీసుకుని రోగాలు నయం చేసుకోవాలన్నారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అమడాలలో వైద్యశిబిరం

కోవెలకుంట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడాల గ్రామంలో వేంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీ, క్లినిక్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ సురేష్ బాబు, శ్రీలక్ష్మి, వైద్య బృందం సభ్యులు పాల్గొని సుమారు 200 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈ మధుబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



మృతి చెందిన వెంకటేశ్వర్లు

రుద్రవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగలపల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (62) అనే రైతు గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. మృతుడి బంధువులు వివరాల మేరకు.. తన పొలంలో సేద్యం చేస్తూ గుండెపోటుతో మరణించినట్లు మృతుడి బంధువులు తెలిపారు. మృతుడికి భార్య రామసుబ్బమ్మ ఉన్నారు.

నేడు ఎగ్గోనికి మంత్రి బీసీ రాక

సంజామల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సోమవారం మండలంలోని ఎగ్గోని గ్రామానికి విచ్చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆదివారం తెలిపారు. రైతన్న మీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతులను కలిసిన బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి

డోన్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం, అబిరెడ్డిపల్లె, జగదుర్తి, ఉడుములపాడు గ్రామాల్లో వైసీపీ నియోజకవర్గ యువనేత బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి రైతులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామ చెరువును పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయన వెంట శ్రీరాములు ఉన్నారు.

జనసేన బీమా.. కార్యకర్తలకు ధీమా

దొర్నిపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనసేన బీమా కార్యకర్తలకు ధీమా అని పార్టీ నాయకులు పగడాల ప్రతాప్, శీల సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం తాడిపల్లెలోని అన్నపూర్ణా కన్వెన్షన్‌హాల్‌లో డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామానికి చెందిన వెంకటలక్ష్మికి రూ.5లక్షలు ప్రమాద బీమా చెక్కును జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు చేతుల మీదుగా అందించారని అన్నారు. గత కొన్ని రోజుల క్రితం డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చిట్టిబాబు ప్రమాదంలో మరణించాడు. చిట్టిబాబు తల్లి వెంకటలక్ష్మికి జనసేన పార్టీ తరఫున రూ.5లక్షలు చెక్కును అందజేశారు.

రోటరీ క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు, ఐ హాస్పిటల్ చైర్మన్ పెండేకంటి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐ హాస్పిటల్ అభివృద్ధికి తన వంతుగా రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. శనివారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు వెంకటరాముడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సభ్యు లంతా కలిసి ఐ హాస్పిటల్ చైర్మన్‌గా పెండేకంటి సుబ్రహ్మణ్యంను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిల్పా సుబ్రహ్మణ్యం, వీరభద్ర శివరాం, శ్రీనివాసులు, శేషారెడ్డి, వెంకటసుబ్బయ్య, నాగేశ్వర్‌రెడ్డి, మోహన క్రిష్ణ, బాలాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

వసతిగృహానికి ఫ్యాన్లు విరాళం

సంజామల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతి గృహానికి కోవెలకుంట్ల రోటరీక్లబ్ ఆదివారం 3 ఫ్యాన్లను విరాళంగా అందజేసింది. సంక్షేమాధికారి మునిరాజుకు రోటరీ క్లబ్ గవర్నర్ ఎం.కె రవీంద్ర ఫ్యాన్లను అందజేశారు. క్లబ్ సభ్యులు శివరామకృష్ణ, చంద్రశేఖర్, తమ సొంత నిధులు వెచ్చించారు. కార్యక్రమంలో వెంకటరాముడు, సుబ్బారావు, శిల్పా సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య, శేషారెడ్డి పాల్గొన్నారు.



ఫ్యాన్లను అందజేస్తున్న రోటరీ క్లబ్ గవర్నర్

ధార్మిక చింతన అలవర్చుకోవాలి

డోన్ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధార్మిక చింతన అలవర్చుకోవాలని మండల విద్యాధికారి హెచ్.రగునాయక్ అన్నా రు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహణాధికారి డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భగవద్గీతా జయంతిని పురస్కరించుకుని ఆదివారం డోన్ పట్టణంలోని శ్రీసుధ బాలు ర ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యార్థులకు జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీ లు నిర్వహించారు. 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు జూనియర్ విభాగంలో 14వ ఆధ్యాయం గుణత్రయ విభాగ యోగం, పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు 16వ ఆధ్యాయం, 18 నుంచి 45 సంవత్సరాల వారికి 'నిత్య జీవితంలో భగవద్గీత - భావ విశ్లేషణ' పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆయా పాఠశాలల నుంచి స్వచ్ఛం దంగా అభ్యర్థులు పాల్గొన్నారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల విభాగంలో బి.సుస్మిత, ఎస్.నాగసాయిచతుర్‌శ్రీ, సి.గీతికలు, 10వ తరగతి ఇంటర్ విభాగంలో జీబీ అవినాశ్, సాయి కార్తీక్, జి.షణ్ముక సాయి, 18 నుంచి 45 సంవత్సరాల విభాగంలో జే.దీపిక, ఏ.సునీల్ కుమార్, కే.చంద్ర బాబు వరుస మూడు స్థానాల్లో బహుమతులు సాధించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో-2 హెచ్.రగునాయక్, న్యాయనిర్ణేతలుగా జిల్లా విశ్రాంత న్యాయాధికారి కే.శివప్ర సాద్, డా.దేవీ దయానంద్ సింగ్, డా.తోగట సురేష్, పసుపులేటి నీలిమ, ఎం.శ్రీసుధ, జి.వనజకుమారి జీ.భానోజీ రావు, జి.శివన్న, జి.వరలక్ష్మిలు హాజరై విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విశ్రాంత న్యాయాధికారి కాశీభట్ల శివప్రసాద్, మల్లు వెంకటరెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థుల్లో ధార్మిక చైతన్యాన్ని కలిగించేందుకు దేవస్థానం చేపడుతున్న కార్యక్రమాల్లో భగవద్గీతా జయంతి ఉత్సవాలు ఒక భాగమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న వక్తలు

అల్లర్లకు పాల్పడితే చర్యలు: ఎస్ఐ

బేతంచెర్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రౌడీషీటర్లు అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆయా గ్రామాల రౌడీషీటర్లకు ఎస్ఐ రమేష్‌బాబు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బేతంచెర్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

కోవెలకుంట్ల: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా గ్రామాల్లో గొడవలు, అలజడులు సృష్టిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని గ్రామాలలో నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరవృత్తిని వదిలి ప్రశాంతంగా జీవించాలని ఆయన సూచించారు.



కోవెలకుంట్లలో..